గోపాల్‌పూర్‌లో పెంపుడు కుక్కకు సమాధి నిర్మించిన నర్సింలు దంపతులు

పెంపుడు కుక్కకు దశదిన కర్మ

జగదేవ్‌పూర్, మే 29 : సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం గోపాల్‌పూర్‌లో నర్సింలు- పద్మ దంపతులు పెంపుడు కుక్కకూ సమాధి కట్టారు. వీరికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉండగా.. కుమార్తె మానస కోరిక మేరకు జాకీ అనే కుక్క పిల్లను పెంచుకున్నారు. నాలుగేండ్ల క్రితం మానస అనారోగ్యంతో మృతిచెందింది. ఆ తర్వాత కూతురి జ్ఞాపకాలను పెంపుడు కుక్కలో చూసుకున్నారు. జాకీ కూడా ఇటీవల అనారోగ్యంతో మరణించింది. సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు జరిపారు. బుధవారం సమాధి కట్టి దశ దినకర్మ చేశారు.

ఎమ్మెల్యే రాజాసింగ్‌కు బెదిరింపు కాల్స్

అబిడ్స్, సుల్తాన్‌బజార్, మే 29: గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే టీ రాజాసింగ్‌కు బుధవారం మరోసారి బెదిరింపు కాల్స్ వచ్చాయి. గతంలో కూడా పలుమార్లు ఆయనకు బెదిరింపు కాల్స్ వచ్చాయి. వేర్వేరు నంబర్లతో ఫోన్‌లో వరుసగా కాల్స్ చేసి బెదిరింపులకు పాల్పడ్డారని, వాయిస్ మెసేజ్ కూడా చేసి బెదిరించారని తెలిపారు. అందులో పాలస్తీనాకు చెందిన తీవ్రవాది ఫొటో, నంబర్ స్పష్టంగా కనిపించిందని, హిందూ ధర్మం పట్ల పని చేయొద్దని, చేస్తే కుటుంబాన్ని హతమారుస్తామంటూ బెదిరించారని రాజాసింగ్ విడుదల చేసిన ఓ వీడియోలో పేర్కొన్నారు.

బాంబు బెదిరింపు కాల్స్ నిందితుడి అరెస్టు

ప్రజాభవన్, నాంపల్లి కోర్టుల్లో బాంబు ఉన్నదంటూ బెదిరింపు ఫోన్‌కాల్స్ చేసిన మౌలాలీ భరత్‌నగర్ పోచమ్మ బస్తీకి చెందిన పీ శివకుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.

3.50 కోట్లు కొల్లగొట్టిన తోడుదొంగలు

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 29 (నమస్తే తెలంగాణ): ఏటీఎం యంత్రాలలో డిపాజిట్ చేయాల్సిన రూ.3.50 కోట్లతో నగదును జమచేసే సంస్థలో పనిచేస్తున్న ఇద్దరు సిబ్బంది ఉడాయించారు. ఈ ఘటనపై కేసు నమోదైంది. సికింద్రాబాద్, బోయిన్‌పల్లిలోని స్క్వేర్ వ్యాల్యూ క్యాష్ మేనేజ్‌మెంట్ సంస్థ ఎస్‌బీఐ ఏటీఎం యంత్రాల్లో నగదును డిపాజిట్ చేస్తుంటుంది. ఈ సంస్థలో షాద్‌నగర్ ఫరూఖ్‌నగర్‌కు చెందిన తెల్లపల్లి లక్ష్మణ్‌బాబు, మరో ప్రాంతానికి చెందిన భార్గవ్ కస్టోడియన్లుగా పని చేస్తున్నారు. ఇద్దరిదీ ఒకే టీమ్. వీరిద్దరిదీ రూట్ నంబర్ 79 (ఎల్‌బీ నగర్) పరిధిలో ఉన్న మొత్తం 33 ఏటీఎంలలో నగదును నింపే బాధ్యత. ఈనెల 23న సంస్థ కార్యాలయంలో ఆడిటింగ్‌కు ఉండగా, ఇద్దరూ పరారయ్యారు. దీంతో అనుమానంతో వారి రూట్లలోని ఏటీఎంలలో నగదును పరిశీలించగా, 27 ఏటీఎంలలో రూ.3,50,43,900 నగదు షార్టేజ్ వచ్చింది.

కొండగట్టు పర్యవేక్షణకు ప్రత్యేకాధికారులు

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): కొండగట్టు హనుమాన్ ఆలయంలో జూన్ 1న జరిగే హనుమాన్ జయంతి ఉత్సవాల పర్యవేక్షణకు దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్లు రామకృష్ణ, వినోద్‌రెడ్డిని ప్రత్యేక అధికారులుగా నియమించినట్టు దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు తెలిపారు. బుధవారం ఆయన సంబంధిత అధికారులతో సమీక్షించారు. జాతరకు హాజరయ్యే భక్తులకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు.

మొండి రోగాలకు ఏఐతో చెక్

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 29(నమస్తే తెలంగాణ): మొండి రోగాలకు టెక్నాలజీతో చెక్ పెట్టేందుకు సీసీఎంబీ కార్యాచరణ రూపొందించింది. టీబీ, మలేరియా వంటి వ్యాధుల నియంత్రణపై అధునాతన చికిత్స విధానాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సాంకేతికతను వినియోగంలోకి తీసుకువస్తుంది. ఆగనిథ సొల్యూషన్స్‌తో సీసీఎంబీ ఒప్పందం చేసుకోగా.. ఇరు సంస్థలు కలిసి డ్రగ్ మాలిక్యులర్ డిజైన్, యాంటిబాడీ, నానోబాడీ ఇంజినీరింగ్ వంటి అంశాల్లో కలిసి పనిచేయనున్నాయి.

రేపుమాపంటున్నరు.. పనిజేస్తలేరు

- నర్సాపూర్ తహసీల్‌కు ఆర్నెళ్ల నుంచి తిరుగుతున్న పట్టింపు లేదు
- అధికారుల తీరుపై బ్రాహ్మణపల్లి రైతు ఆవేదన

నర్సాపూర్ తహసీల్దార్‌కు సమస్యను విన్నవించుకుంటున్న రైతు కృష్ణమూర్తి

నర్సాపూర్, మే 29 : మెదక్ జిల్లా నర్సాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో తమ పనులు కావడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయానికి వెళ్తే రేపు, మాపు అంటూ తిప్పి పంపిస్తున్నారని వాపోతున్నారు. కార్లలో వచ్చే బడాబాబులకు మాత్రం కూర్చోపెట్టి మరీ పనులు చేయించి పెడుతున్నారని, పేద రైతులు వస్తే పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు. నర్సాపూర్ మండలం బ్రాహ్మణపల్లికి చెందిన రైతు ఆకుల కృష్ణమూర్తికి ఇలాంటి పరిస్థితే ఎదురైంది. ఈయనకు బ్రాహ్మణపల్లిలోని 247/అ(3) సర్వే నంబర్‌లో 16 గుంటల భూమి వారసత్వంగా వచ్చింది. ఇక్కడే అతనికి సమస్య వచ్చిపడింది. ఈ 16 గుంటల పట్టాభూమి అసైన్డ్ భూమిగా పాస్‌బుక్‌లో నమోదైంది. అసైన్డ్ భూమి నుంచి పట్టా భూమిలోకి మార్చాలని ఆరు నెలలుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నాడు. సమస్యను పరిష్కరించాలని కోరితే రేపుమాపంటూ తిప్పి పంపుతున్నారని తెలిపాడు. ఎన్నికల ముందుపోతే ఎన్నికల తర్వాత రమ్మన్నారని, ఇప్పుడేమో ఫలితాల తర్వాత రమ్మంటున్నారు అని బాధిత రైతు కృష్ణమూర్తి ఆవేదన వ్యక్తంచేశాడు. బుధవారం నేరుగా తహసీల్దార్ కమలాద్రి దగ్గరకు వెళ్లి తన సమస్యను చెప్పగా, పూర్తిగా వినకుండానే వచ్చే నెల నాలుగో తేదీ తర్వాత రమ్మని సూచించాడని, 6 నెలల నుంచి తిరుగుతున్నానని వేడుకున్నా పట్టించుకోలేదని తెలిపాడు. ఎన్నికల ఫలితాల బిజీలో ఉన్నామని, ఫలితాల తర్వాత సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దార్ చెప్పినట్టు రైతు పేర్కొన్నాడు. తహసీల్దార్ బిజీగా ఉంటే కిందిస్థాయి అధికారులతోనైనా సమస్యను పరిష్కరించాలని ఆదేశించకుండా వెళ్లిపో అని అనడం బాధించిందని సదరు రైతు ఆవేదన చెందాడు. 10 కిలోమీటర్ల దూరం నుంచి ఎండలో పడివస్తే ఇలా తిప్పి పంపిస్తున్నారని కంటతడి పెట్టుకున్నాడు. పైగా తహసీల్దార్ కమలాద్రి రైతు కృష్ణమూర్తి గ్రామానికి స్పెషల్ ఆఫీసర్ కావడం గమనార్హం.

సూర్యాపేట ఎస్పీ పేరిట నకిలీ ఫేస్‌బుక్ ప్రొఫైల్

సైబర్ నేరగాళ్లు తన ఫేస్ బుక్ ప్రొఫైల్‌ను పోలిన రెండు నకిలీ ఫేస్‌బుక్ ప్రొఫైల్స్‌ను క్రియేట్ చేసినట్టు సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. వాటి నుంచి వచ్చే మెసేజ్‌లు, రిక్వెస్ట్‌లకు ఎవరూ స్పందించవద్దని సూచించారు. వ్యక్తిగత వివరాలు చెప్పవద్దని, డబ్బులు పంపవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నకిలీ ఖాతాను రూపొందించిన వారిని గుర్తించి వారిపై కేసు నమోదు చేయనున్నట్టు పేర్కొన్నారు.

– సూర్యాపేట సిటీ

ఇసుక తరలింపును అడ్డుకున్న రైతులు

- కలెక్టర్ అనుమతించినా ససేమిరా
- వెనుదిరిగిన పొక్లెయిన్లు

దేవరుప్పుల, మే 29: జనగామ జిల్లా గొల్లపల్లి వాగు నుంచి ఇసుక తరలింపును బుధవారం రైతులు అడ్డుకున్నారు. పాలకుర్తి రిజర్వాయర్‌కు 5000 క్యూబిక్ మీటర్ల ఇసుకను తరలించేందుకు కలెక్టర్ రిజ్వాన్ బాషా అనుమతివ్వగా కాంట్రాక్టర్ వాగులో పొక్లెయిన్‌లు పెట్టి ట్రాక్టర్లలో నింపి తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. విషయం తెలుసుకున్న దేవరుప్పుల, గొల్లపల్లి రైతులు ఎట్టి పరిస్థితిల్లోనూ ఇసుకను తరలించేది లేదని, ఇసుక పోతే నీరు నిల్వ ఉండదని, తమ వ్యవసాయ భూములను పడావు పెట్టాల్సి వస్తుందని రైతులు అడ్డుకున్నారు. ఈ రెండు గ్రామాలకు చెందిన రైతులతోపాటు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు పార్టీలకతీతంగా పొక్లెయిన్ మెషిన్లను వాగు నుంచి తరలించాలని పట్టుబట్టారు. రిజర్వాయర్ కాంట్రాక్టర్, సిబ్బందితో వాదనకు తిగారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు రైతులకు నచ్చజెప్పారు. మరోమారు వస్తే ప్రతిఘటిస్తామని వారు హెచ్చరించారు.

ఉద్యోగులకు 51 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర రెండో పే రివిజన్ కమిషన్ చైర్మన్ శివశంకర్‌కు రాష్ట్ర ఉద్యోగుల తరపున వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మార్త రమేశ్, ఉపాధ్యక్షుడు దేవేందర్, కార్యదర్శి ఆకుల వెంకట్‌రావు

బుధవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో భేటీ అయిన జర్మనీ కాన్సుల్ జనరల్ మిచ్చెల కుచ్లర్. ఈ సందర్భంగా కుచ్లర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న సీఎస్

ప్లాస్టిక్ ఫ్రీ జోన్‌గా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌ను జూలై నెలాఖరులోగా పూర్తిగా ప్లాస్టిక్ రహిత జోన్‌గా మార్చేందుకు ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో అటవీ, పంచాయతీరాజ్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌ను ప్లాస్టిక్ ఫ్రీ జోన్‌గా మార్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. కాగితపు సంచులు, గుడ్డ-జనపనార సంచులు, విస్తరాకులు మొదలైన పర్యావరణ అనుకూల ఉత్పత్తుల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోని నాలుగు ఆవాసాల్లో నివాసముంటున్న ప్రజలను తరలించే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని మైసమ్మ దేవాలయంలో ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో అటవీ శాఖ ముఖ్యకార్యదర్శి వాణీ ప్రసాద్, పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, పీసీసీఎఫ్ ఆర్‌యం డోబ్రియాల్, టీఎస్‌పీసీబీ సభ్య కార్యదర్శి బుద్ధ ప్రకాశ్ జ్యోతి, దేవాదాయ కమిషనర్ హనుమంతరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సుమోటోగా శిశువుల విక్రయం కేసు

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఇటీవల వెలుగుచూసిన నవజాత శిశువుల విక్రయ ఘటన కేసును సుమోటోగా తీసుకొని విచారణ జరపాలని తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సూచించింది. ప్రజలను ఎంతగానే కలిచివేసిన ఈ ఘటనపై విచారణను వేగవంతం చేయాలని ఒక ప్రకటనలో పేర్కొన్నది. ఈ రాకెట్ నుంచి 16 మంది చిన్నపిల్లలను కాపాడి, శిశువిహార్‌కు తరలించిన పోలీసుల కృషిని కమిషన్ అభినందించింది. ఈ చైల్డ్ ట్రాఫికింగ్ ముఠాను కనుగొనడానికి, దోషులను విచారించి శిక్షించడానికి, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవడానికి సమగ్ర విచారణ అవసరమని కమిషన్ అభిప్రాయపడింది.

ఏసీబీ సిబ్బందికి ప్రశంసాపత్రాలు

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ శాఖల్లో అవినీతి అధికారులను చాకచక్యంగా పట్టుకొంటున్న ఏసీబీ సిబ్బందిని ఆ శాఖ డైరెక్టర్ జనరల్ సీవీ ఆనంద్ బుధవారం అభినందించారు. సిబ్బందికి రివార్డులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. సమాచారం వచ్చిన వెంటనే ఏసీబీ అధికారులు పథకం రచించి అవినీతి అధికారులను అరెస్టు చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఏసీబీ డైరెక్టర్ ఏఆర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేఆర్‌ఎంబీ చైర్మన్‌గా అశోక్‌గోయల్

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్‌ఎంబీ) చైర్మన్‌గా అశోక్ ఎస్ గోయల్ నియమితులయ్యారు. కేంద్రజల్‌శక్తి శాఖ మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. కేఆర్‌ఎంబీ ప్రస్తుత చైర్మన్ శివనందన్‌కుమార్ గురువారం ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఆయన స్థానంలో అశోక్ గోయల్‌ను నియమిస్తూ కేంద్రం ఉత్తర్వులిచ్చింది. పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈవోగా అతుల్‌జైన్‌కు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ కేంద్ర జల్‌శక్తిశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్‌గా ఇప్పటికే అదనపు బాధ్యతలను నిర్వర్తిస్తున్న అతుల్ జైన్‌కు పీపీఏ బాధ్యతలను సైతం కేంద్రం అప్పగించింది.

కర్ణాటకలో 87 కోట్ల స్కామ్!

- రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్ ఖాతా నుంచి అక్రమంగా కోట్ల రూపాయలు బదిలీ
- స్కామ్‌లో మంత్రి నాగేంద్ర హస్తం!
- కార్పొరేషన్ అకౌంట్స్ అధికారి ఆత్మహత్యతో తాజాగా వెలుగులోకి
- సూసైడ్ నోట్‌లో మంత్రి నాగేంద్ర సహా పలువురు కార్పొరేషన్ అధికారుల పేర్లు
- మంత్రి రాజీనామాకు బీజేపీ డిమాండ్

మంత్రి నాగేంద్ర

బెంగళూరు/శివమొగ్గ, మే 29: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో తాజాగా రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్‌లో రూ.87 కోట్ల స్కామ్ వెలుగుచూసింది. కార్పొరేషన్‌కు సంబంధించిన బ్యాంకు ఖాతా నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా కోట్లాది రూపాయలు కొన్ని సాఫ్ట్‌వేర్ కంపెనీల బ్యాంకు ఖాతాలకు బదిలీ అయ్యాయి. ఈ ఏడాది మార్చిలో అక్రమ మార్గంలో నిధులు ట్రాన్స్‌ఫర్ అయినట్టు తెలుస్తున్నది. ఈ కుంభకోణంలో ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి బీ నాగేంద్ర హస్తం ఉన్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఎస్టీ కార్పొరేషన్‌లో పనిచేసే అకౌంట్స్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ ఆదివారం సాయంత్రం ఆత్మహత్య చేసుకొన్న నేపథ్యంలో ఈ స్కామ్ తాజాగా వెలుగులోకి వచ్చింది. చంద్రశేఖర్ ఆత్మహత్య నోట్‌లో మంత్రి నాగేంద్రతో పాటు పలువురు కార్పొరేషన్ ఉన్నతాధికారుల పేర్లను ప్రస్తావించారు. తన చావుకు కార్పొరేషన్ ఎండీ జేజీ పద్మనాభం, అకౌంట్స్ ఆఫీసర్ పరుశురాం దురుగన్నవర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ సుచిస్మిత రావల్ కారణమని చంద్రశేఖర్ తన సూసైడ్ నోట్‌లో రాశాడు.

సాఫ్ట్‌వేర్ కంపెనీల ఖాతాలకు సొమ్ము

ఎస్టీ కార్పొరేషన్‌కు స్థానిక ఎంజీ రోడ్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో ఖాతా ఉన్నది. దాని నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అదే బ్యాంకు ఇతర బ్రాంచ్‌లకు రూ.87 కోట్లు బదిలీ అయినట్టు సమాచారం. ఈ డబ్బు కొన్ని సాఫ్ట్‌వేర్ కంపెనీల ఖాతాలకు వెళ్లినట్టు తెలుస్తున్నది. ఈ స్కామ్ ఆరోపణలపై ప్రభుత్వం సీఐడీ విచారణకు ఆదేశించింది.

నేను రాజీనామా చేయను: నాగేంద్ర

ఎస్టీ కార్పొరేషన్‌లో స్కామ్‌ను మంత్రి బీ నాగేంద్ర మంగళవారం ధ్రువీకరించారు. అయితే తన మంత్రి పదవికి రాజీనామా చేసేందుకు ఆయన నిరాకరించారు. తనకు ఈ స్కామ్‌లో ఎలాంటి పాత్ర లేదన్నారు.

'బాంబే' బ్లడ్‌గ్రూప్ రక్తదానానికి 400 కిలోమీటర్ల ప్రయాణం

ఇండోర్: బాంబే బ్లడ్ గ్రూప్.. అత్యంత అరుదైన గ్రూప్ ఇది. ఇలాంటి బ్లడ్‌గ్రూపే కలిగి చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఓ మహిళ ప్రాణాలు కాపాడేందుకు ఓ వ్యక్తి ఏకంగా 400కుపైగా కిలోమీటర్లు ప్రయాణం చేసి రక్తదానం చేశాడు. మహారాష్ట్రలోని షిర్డీకి రవీంద్ర అష్టేకర్ (36) పూల వ్యాపారి. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన ఓ మహిళ (30) దవాఖానలో ప్రాణాలతో పోరాడుతున్నదని, ఆమెకు అర్జెంటుగా బాంబే బ్లడ్‌గ్రూప్ కావాలన్న వాట్సాప్ మెసేజ్ చూసిన రవీంద్ర వెంటనే స్నేహితుడి కారులో బయలుదేరాడు. 440 కిలోమీటర్లు ప్రయాణించి ఈ నెల 25న రక్తదానం చేసి ఆ మహిళ ప్రాణాలను కాపాడగలిగాడు. అత్యంత అరుదైన బ్లడ్‌గ్రూప్ కలిగిన రవీంద్ర రాష్ట్రాలతో సంబంధం లేకుండా ఎక్కడ ఎవరికి అవసరం పడినా వెంటనే వెళ్లి రక్తదానం చేస్తారు. ఇలా మహారాష్ట్రతోపాటు గుజరాత్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో గత పదేండ్లలో 8 సార్లు రక్తదానం చేశారు. బాంబే బ్లడ్‌గ్రూప్‌ను 1952లో కనుగొన్నారు. ఇందులో 'హెచ్' యాంటిజెన్‌కు బదులుగా యాంటీ-హెచ్ యాంటీబాడీస్ ఉంటాయి. వీరికి ఆ గ్రూపు కలిగిన వారే రక్తం ఇవ్వాల్సి ఉంటుంది.

పంట నష్టపోయినా పరిహారం కష్టమే!

- నూతన బీమా పథకంలో శాస్త్రీయత శూన్యం
- రైతు యూనిట్‌గా అమలు లేనట్టే
- పాత పద్ధతిలోనే ఫసల్ బీమా అమలు చేయనున్న ప్రభుత్వం
- ఇతర పంటలను విస్మరించిన రేవంత్ సర్కారు

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): రైతు యూనిట్‌గా పంటల బీమా పథకాన్ని అమలు చేస్తే పంట నష్టం జరిగినప్పుడు రైతుకు న్యాయం జరుగుతుంది. కానీ, కేంద్రం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనతోపాటు రాష్ట్రం అమలు చేయబోతున్న పంటల బీమా పథకంలో ఈ మూల సూత్రం లోపించింది.రాష్ట్రంలోని 32 జిల్లాల్లో ఈ వానకాలం సీజన్ నుంచి 10 పంటలకు ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఎలాంటి శాస్త్రీయత లేకుండా ఈ పథకాన్ని అమలు చేస్తున్నారంటూ జిల్లా వ్యవసాయాధికారులు పెదవి విరుస్తున్నారు.

మడమ తిప్పిన రేవంత్ ప్రభుత్వం

ఫసల్ బీమా పథకంలో మార్పులు చేసి, రైతును యూనిట్‌గా పరిగణించి రాష్ట్రంలోని ప్రతి రైతుకు మేలు జరిగేలా చూస్తామని రేవంత్‌రెడ్డి సర్కారు గొప్పలు చెప్పింది. కానీ, గ్రామం, మండలం, జిల్లా యూనిట్‌గా పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. దీంతో ఈ విధానం వల్ల రైతులకు పెద్దగా ఒరిగేదేమీ ఉండదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పంటనష్టం అంచనాలో శాస్త్రీయత శూన్యం

భౌగోళిక పరిస్థితులను, ప్రధాన పంటల సాగునుపరిగణనలోకి తీసుకోకుండా గ్రామం, మండలం, జిల్లా యూనిట్‌గా పరిగణించి 10 పంటలకు ఫసల్ బీమా పథకాన్ని వర్తింపజేస్తున్నారు.వీటిలో వరి పంటకు మాత్రమే గ్రామాన్ని యూనిట్‌గా పరిగణిస్తున్నారు. మిగిలిన పంటలకు మండలాన్ని, జిల్లాను యూనిట్‌గా తీసుకోవడంతో రైతులకు అనేక ఇబ్బందులు తలెత్తడం ఖాయంగా కనిపిస్తున్నది.

- ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో వరితోపాటు పసుపు, మొక్కజొన్నను అధికంగా సాగు చేస్తారు. ఈ పంటలకు బీమా పథకాన్ని అమలుకు గ్రామాన్ని కాకుండా మండలాన్ని, జిల్లాను యూనిట్‌గా పరిగణిస్తున్నారు.
- కంది అధికంగా సాగయ్యే వికారాబాద్ జిల్లాలో ఆ పంటకు బీమాకు గ్రామాన్ని కాకుండా మండలాన్ని, జిల్లాను యూనిట్‌గా పరిగణనలోకి తీసుకుంటున్నారు.

మక్క, కంది,సోయా రైతులకు అన్యాయమే

ప్రభుత్వం అమలు చేయబోతున్న ఫసల్ బీమా పథకం వల్ల రాష్ట్రంలోని మొక్కజొన్న, కంది, సోయా రైతులకు అన్యాయం జరుగనున్నది. ఈ పంటలకు బీమాను వర్తింపజేసేందుకు నిర్మల్ జిల్లాలో మినహా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో మండలాన్ని, జిల్లాను యూనిట్‌గా తీసుకుంటున్నారు. దీని వల్ల పంట నష్టం జరిగితే వరి రైతులకు తప్ప మిగిలిన రైతులకు పరిహారం లభించడం గగనమే.

రైతును యూనిట్‌గా పరిగణిస్తే..

- పంట నష్టంపై జరిపే సర్వేలో ఒక్కో రైతుకు సంబంధించిన పంట నష్టాన్ని అంచనా వేస్తారు. దీంతో పంట నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం దక్కుతుంది.

గ్రామాన్ని యూనిట్‌గా పరిగణిస్తే..

- గ్రామంలో ఒకవైపు ఎక్కువ, మరోవైపు తక్కువ పంట నష్టం జరిగితే మొత్తం గ్రామంలో జరిగిన పంట నష్టాన్ని లెక్కిస్తారు. ఇందులో 33% పంట నష్టం వాటిల్లినట్టు నిర్ధారణ అయితేనే రైతులకు పరిహారాన్ని అందజేస్తారు.

మండలాన్ని, జిల్లాను యూనిట్‌గా ..

- ఒక గ్రామంలో పంటలు దెబ్బతిని, మరి కొన్ని గ్రామాల్లో పంటలు బాగానే ఉంటే నష్టపోయిన రైతులకు పరిహారం అందదు.

సోనియా పర్యటనపై సీఎం సమీక్ష

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర అవతరణ వేడుకలకు కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ హాజరవుతుండటంతో కార్యక్రమ నిర్వహణను సీఎం రేవంత్‌రెడ్డితోపాటు పార్టీ నేతలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకొన్నారు. పరేడ్‌గ్రౌండ్‌లోని ప్రధాన వేడుకల ఏర్పాట్లపై సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ నేతలతో సమీక్షించారు. కార్యక్రమానికి కనీసం 25 వేల మంది హాజరయ్యేలా అధికారులకు ప్రభుత్వం టార్గెట్ విధించినట్టు తెలిసింది. హైదరాబాద్ నగరం నుంచే ఎక్కువ మందిని సమీకరించేలా మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతారెడ్డి అధికారులతో సమన్వయం చేస్తున్నారు. గత ప్రభుత్వం కంటే భారీగా నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్టు ఒక అధికారి చెప్పారు. పరేడ్‌గ్రౌండ్‌లో ఆరు గ్యారెంటీలపై ఐఅండ్‌పీఆర్ ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయనున్నారు.

సంపదలో అత్యధిక భాగం దాతృత్వానికే

ఓపెన్ ఏఐ సీఈఓ ఆల్ట్‌మన్



వాషింగ్టన్: మానవాళి మేలు కోసం తమ సంపదను త్యాగం చేసే బిలియనీర్ల జాబితాలో ఓపెన్ ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ చేరారు. తమ సంపదలో అత్యధిక భాగం దాతృత్వానికి అందజేయనున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు ఆయనతోపాటు ఆయన భాగస్వామి ఓలివర్ ముల్హెరిన్ 'ది గివింగ్ ప్లెడ్జ్' దాతృత్వ కార్యక్రమంపై సంతకం చేశారు. ఈ ప్రపంచం అభివృద్ధి చెందడం కోసం అనేక మంది ఎంతో శ్రమిస్తున్నారని, విజ్ఞానం, దాతృత్వం, అంకిత భావాలతో కృషి చేస్తున్నారని, వారు ఏర్పాటు చేసిన వేదిక తాము ఈ స్థాయికి చేరడానికి అవకాశం కల్పించిందని వీరిద్దరూ లేఖలో పేర్కొన్నట్లు ఈ చారిటీ సంస్థ తెలిపింది. 'ది గివింగ్ ప్లెడ్జ్' చారిటీ సంస్థను వారన్ బఫెట్, బిల్ గేట్స్, మెలిండా గేట్స్ 2010లో ప్రారంభించారు. ప్రపంచంలోని సంపన్నులు దానం చేసేలా ఈ సంస్థ ప్రోత్సహిస్తుంది. ఇప్పటి వరకు 30 దేశాలకు చెందిన 240 మంది సంపన్నులు భారీగా విరాళం ఇస్తామని ప్రకటించారు.

పెళ్లయిన 12 రోజులకు భార్య మగాడని తెలిసింది

ఇండోనేషియా యువకుడికి షాక్

జకర్తా, మే 29: కొత్తగా పెండ్లి అయిన ఇండోనేషియా యువకుడికి ఊహించని అనుభవం ఎదురైంది. తన భార్య అమ్మాయి కాదు.. అబ్బాయని తెలిసి అతడు షాక్ తిన్నాడు. పెండ్లయిన 12 రోజులకు ఈ విషయం బయటపడింది. సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ కథనం ప్రకారం.. 26 ఏండ్ల యువకుడు గత ఏడాది సామాజిక మాధ్యమంలో పరిచయమైన అదినా కంజాను ఏప్రిల్ 12న వివాహం చేసుకున్నాడు. పెండ్లి అయిన తర్వాత భార్య నిరంతరం ముఖం దాచుకోవడం, దగ్గరకు రాకపోవడం, ఏదో వంక పెడుతూ కలయికకు దూరంగా ఉండటంతో అతడికి అనుమానం వచ్చింది. తీరా విచారించగా విస్తుపోయే నిజాలు తెలిశాయి. వాస్తవానికి తనకు తల్లిదండ్రులు లేరంటూ ఆమె చెప్పినవన్నీ అబద్ధాలని, వారు బతికే ఉన్నారని తెలుసుకున్నాడు. వారి ద్వారా అదినా అమ్మాయి కాదు అబ్బాయి అని తెలిసి విస్తుపోయాడు. తన ఆస్తి కాజేయడానికే అమ్మాయిగా నటించినట్టు తేలింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు అదినాను అరెస్ట్ చేశారు.

8 మంది కుటుంబసభ్యుల్ని చంపి ఆత్మహత్య

మధ్యప్రదేశ్‌లో దారుణం

ఛింద్వారా: మధ్యప్రదేశ్‌లోని ఛింద్వారాలో బుధవారం దారుణం జరిగింది. ఈ నెల 21న వివాహం చేసుకున్న వ్యక్తి కర్కశంగా తన భార్య సహా ఎనిమిది మందిని హత్య చేసి, తాను కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, బోడల్ కచ్చర్ గ్రామంలో నివసిస్తున్న దినేశ్ సరియమ్ (26) మంగళ-బుధవారాల మధ్య రాత్రి 2.30 గంటల సమయంలో దారుణానికి తెగబడ్డాడు. గొడ్డలితో విచక్షణ లేకుండా తన భార్య, తల్లి, సోదరి, సోదరుడు, వదిన, ముగ్గురు చిన్నారులను హత్య చేశాడు. మేనల్లుడిపై దాడి చేసినప్పటికీ, అతడు ఏదోవిధంగా తప్పించుకోగలిగారు. అనంతరం దినేశ్ ఓ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రాథమిక విచారణలో దినేశ్‌కు మానసిక అస్వస్థత ఉన్నట్లు తెలిసింది. మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం పంపించారు. గాయపడిన వ్యక్తిని ఓ ప్రైవేట్ దవాఖానలో చేర్పించారు.

ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు

మిలియన్ మార్చ్ తరహాలో పోరాడుతాం

- కులగణన చేయకుండా ఎన్నికలకు పోవద్దు
- బీసీ కులసంఘాల విస్తృతస్థాయి సమావేశంలో వక్తలు

ఖైరతాబాద్, మే 29: కులగణన చేపట్టకుండా రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికల ప్రక్రియ చేపడితే మిలియన్ మార్చ్ తరహాలో పోరాటాలు నిర్వహిస్తామని బీసీ కుల సంఘాలు, మేధావుల విస్తృతస్థాయి సమావేశంలో వక్తలు స్పష్టంచేశారు. బీసీ సంక్షేమ సంఘం, బీసీ కులసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం సమావేశం జరిగింది. కులగణన, రిజర్వేషన్ల పెంపు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎలాంటి మినహాయింపులు, అప్షన్లు ఇవ్వవమని తేల్చి చెప్పారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు మాట్లాడుతూ బీహార్ రాష్ట్ర తరహాలోనే తెలంగాణలో కూడా కులగణన చేపట్టి బీసీలకు న్యాయం చేయాలని కోరారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ జూన్ 4న ఎన్నికల కోడ్ ముగిసిన రెండు మూడు రోజుల్లోనే కులగణన కోసం ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తాత్సారం చేస్తే మిలియన్ మార్చ్ తరహాలో ఉద్యమిస్తామని తెలిపారు. ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ మాట్లాడుతూ పదవులు, సీట్లు అడిగే బదులు బీసీ ముఖ్యమంత్రే లక్ష్యంగా ముందుకు సాగాలని చెప్పారు. సమావేశంలో ప్రొఫెసర్ డాక్టర్ ఈ వెంకటేశ్, వివిధ బీసీ కులసంఘాల రాష్ట్ర అధ్యక్షులు బాలరాజుగౌడ్, వేముల వెంకటేశం, బైరి రవికృష్ణ, శేఖర్‌సాగర్, పూసల శ్రీనివాస్ జయంతిరావు, నరేందర్, శ్యామ్ కురుమ, నారాయణగౌడ్, బూర మల్సూర్, శ్యామల, సుజాత తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించాకే ఎన్నికలు నిర్వహించాలి

సర్పంచ్‌ల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్

ములుగు, మే 29 (నమస్తేతెలంగాణ): గ్రామాల్లో సర్పంచ్‌లుగా పదవీ కాలం పూర్తయ్యే వరకు చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు చెల్లించాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని సర్పంచ్‌ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు, తాజా మాజీ సర్పంచ్ సుర్వి యాదయ్యగౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం ములుగు జిల్లా కేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు భూక్యా పాప పవన్‌నాయక్ అధ్యక్షతన చేపట్టిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బిల్లులు చెల్లించాలని పలుమార్లు సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రాలు అందించినా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ములుగు నుంచి పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క ఉన్నందున ఇక్కడి నుంచే పోరాటం చేసేందుకు సమావేశమైనట్టు చెప్పారు. పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా అప్పటి సీఎం కేసీఆర్‌కు బిల్లుల విషయాన్ని తెలియనివ్వకుండా నిధులను పక్కదారి పట్టేలా చేశారని ఆరోపించారు. బిల్లులు చెల్లించకుండా ఎన్నికలకు పూనుకుంటే గ్రామ స్థాయిలో చేపట్టిన పల్లె ప్రకృతి వనాలు, శ్మశాన వాటికలు, డంపింగ్‌యార్డు, జీపీ భవనాలకు తాళాలు వేసి అక్కడే బైఠాయించి పోరాటాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. అప్పులు చేసి గ్రామాభివృద్ధికి ముందుండి సర్పంచ్‌లుగా తమ గౌరవాన్ని గ్రామాల్లో నిలుపుకొన్నామని, ప్రస్తుతం తమ పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆవేదన చెందారు.


ములుగులో మాట్లాడుతున్న సర్పంచ్‌ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్